క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

బంట్వారం: కోట్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 6వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

భద్రేశ్వరుడికి 'కోటం' ప్రత్యేక పూజలు


పూజలో పాల్గొన్న కోటం కుటుంబీకులు

తాండూరు టౌన్: శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి జాతర ఉత్సవాలను పురస్కరించుకుని.. అనవాయితీ ప్రకారం కోటం వీరప్ప కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి మొక్కులు చెల్లించుకున్నారు. పుష్కర కాలంగా పట్టణానికి చెందిన కోటం కుటుంబీకులు.. 12వ సారి స్వామివారి పల్లకీ సేవ అలంకరణకు భారీ గజ మాలను సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు విజయకుమార స్వామి, మల్లికార్జున స్వామి, ఈఓ శేఖర్ గౌడ్, భద్రన్న, వినోద్, భాస్కర్, లింగదల్లి రవి, సందీప్, వీరశైవ యువదళ్ సభ్యులు పాల్గొన్నారు.

బస్టాండులో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

కొడంగల్: నియోజకవర్గ కేంద్రమైన కొడంగల్ బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. సంస్థ సివిల్ ఇంజినీరింగ్ విభాగం చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రావ్, సిబ్బంది రమణమూర్తి, బీఆర్ సింగ్‌లు శనివారం బస్టాండ్‌ను సందర్శించారు. ప్రాంగణ ఆవరణలో మూత్రశాలల సంఖ్యను పెంచడంతో పాటు, తదితర సదుపాయాల కల్పనకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. గత నెల 24వ తేదీన టీఎస్ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ పురుషోత్తం బస్టాండ్‌ను తనిఖీ చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే సంస్థ అధికారులు ప్రయాణ ప్రాంగణాన్ని పరిశీలించారు.

నియామకం

అనంతగిరి: బీజేపీ వికారాబాద్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా ఉప్పు అమర్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం నియామకపత్రం అందజేశారు. అనంతరం మాధవరెడ్డి మాట్లాడారు. పార్టీ కోసం అహర్నిషలు పాటుపడే శ్రేణులకు బీజేపీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఇందులో పార్టీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, జిల్లా కోశాధికారి సతీష్, సీనియర్ నాయకులు రాజేందర్‌రెడ్డి, శ్రీకాంత్ ఉన్నారు.

జాతరలో అన్నదానం


అన్నదానం చేస్తున్న శుభప్రద్ పటేల్

తాండూరు టౌన్: శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి జాతరలో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ శనివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని స్వామివారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో జెడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, ఆలయ ఈఓ శేఖర్ గౌడ్, ఆలయ మాజీ చైర్మన్ సుధాకర్, వీరశైవ సమాజ అధ్యక్షుడు ఆర్.బస్వరాజ్, వాలి శాంత్‌కుమార్, బస్వరాజ్, విజయ్, రవిశంకర్, విశ్వనాథం, శశాంక్, చందు, శ్రావణ్, బసంత్, వెంకట్, భాను, రాము, హరీశ్, శ్రీశైలం, సంజయ్ గౌడ్ పాల్గొన్నారు.

ఉద్యోగులందరికీ బాండ్లు ఇవ్వాలి

పరిగి: ఆర్టీసీ ఉద్యోగులకు 2013 వేతన సవరణకు సంబంధించిన బాండ్లు, వేతనాలను వెంటనే చెల్లించాలని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సంస్థ యాజమాన్యం డ్రైవర్లకు మాత్రమే బాండ్లు ఇచ్చి, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బందికి ఇవ్వకపోవడం సరైంది కాదని హితవు పలికారు. కొందరికి ఇచ్చి, మరికొందరికి ఇవ్వక పోవడంతో మిగతా వారు నిరాశతో ఉన్నారని, కావున యాజమాన్యం స్పందించి ఉద్యోగులందరికీ చెల్లించాలని కోరారు.

మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

ధారూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు శనివారం వరి ధాన్యం పోటెత్తింది. దొడ్డు రకం ధాన్యం బస్తాలు 3,574 రాగా.. క్వింటాల్‌కు రూ.2,010 నుంచి రూ.2,040 ధరతో కొనుగోళ్లు జరిగినట్లు కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. సన్న రకం ధాన్యం 579 బస్తాలు వచ్చాయని, క్వింటాల్‌కు రూ.2,340 నుంచి రూ.2,360 వరకు ధర పలికినట్లు ఆమె వెల్లడించారు. కొనుగోలుకు వ్యాపారులు రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు. మొక్కజొన్న 1,474 బస్తాలు వచ్చాయని, క్వింటాల్‌కు రూ.2,260 నుంచి రూ.2,280 వరకు ధర పలికిందని కార్యదర్శి వివరించారు.

బీజేపీ అధికారంలోకి వస్తే ప్రమాదం

- ఎన్నికల అనంతరం మిగతా పథకాల అమలు
- ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి
- వలసలు అరికట్టింది కాంగ్రెస్సే..
- చేతి గుర్తుకు ఓటేద్దాం.. రాహుల్‌ను ప్రధానిని చేద్దాం
- ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ శ్రేణులు


కుల్కచర్ల: ముజాహిద్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: 'బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుంది. ప్రజలు ఆలోచించి, ఓటు వేయాలి' అని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధి ముజాహిద్‌పూర్ గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అధ్యక్షతన, పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డికి మద్దతుగా నిర్వహించిన కార్నర్ మీటింగులో ఎమ్మెల్యే మాట్లాడారు. పేదల అభ్యున్నతికి నాడు కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లను అమలుచేస్తే.. నేడు అధికారంలో ఉన్న బీజేపీ వాటిని తొలగించేందుకు యత్నిస్తుందని ఆరోపించారు. అదే జరిగితే ఎంతోమంది పేదలకు అన్యాయం జరుగుతుందని వెల్లడించారు. పార్లమెంటు ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి, రంజిత్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే టీఆర్ఆర్ అభ్యర్థించారు. ఇందులో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఎంపీపీ సత్యమ్మ, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, పార్టీ బ్లాక్ బి అధ్యక్షుడు భరత్ కుమార్, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, పార్లమెంట్ ఇన్‌చార్జి గణేశ్ నాయక్, శాంతిరంగ్య, రవి, విఠల్, రాహుల్ నాయక్, హన్మంతు పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి

ధారూరు: ఉపాధిహామీ ద్వారా కూలీలకు ఉపాధి కల్పించి, వలసలను అరికట్టింది కాంగ్రెస్సేనని ఆ పార్టీ మండల నాయకుడు రమేశ్‌కృష్ణ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధి గట్టెపల్లితండాలో హస్తం శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. ఇండియా కూటమితోనే దేశ అభివృద్ధి సాధ్యమని, చేతి గుర్తుకు ఓటువేసి, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

రాహుల్‌ను ప్రధానిని చేద్దాం

మోమిన్‌పేట: పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా నిలిచి, రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేద్దామని ఆ పార్టీ నాయకుడు సురేందర్ పిలుపునిచ్చారు. ఇజ్రాచిట్టంపల్లి గ్రామంలో రంజిత్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. చేతి గుర్తుకు ఓటు వేసి, కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు మాణయ్య, చంద్రయ్య, శ్రీనివాస్, సుభాష్ ఉన్నారు.

హస్తంతోనే గిరిజనుల సంక్షేమం

కుల్కచర్ల: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే ఆదివాసీ గిరిజనులకు సంక్షేమ ఫలాలు అందుతాయని అఖిల భారత బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాహుల్ నాయక్ అన్నారు. మండల పరిధి సాల్వీడు గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. పేదల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, లోక్‌సభ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటువేసి, కాంగ్రెస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

రంజిత్‌కు భారీ మెజార్టీ ఖాయం

యాలాల: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబాతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ పూర్తవగానే మిగతా గ్యారంటీలు అమల్లోకి వస్తాయని తెలిపారు. ఇందులో పార్టీ గ్రామ అధ్యక్షుడు నాగయ్య, నాయకులు మోయిజ్, శ్రీనివాస్, అశోక్ నాయీ, మారుతి, మైనొద్దీన్ ఉన్నారు.

మతోన్మాద పార్టీని ఓడిద్దాం

ధారూరు: మతోన్మాద బీజేపీని ఓడించి, లౌకిక, ప్రజాస్వామ్య శక్తి అయిన కాంగ్రెస్‌ను గెలిపించి, లౌకిక రాజ్యాన్ని స్థాపిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేతి గుర్తుకు ఓటువేసి, పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇందులో సీపీఎం నాయకులు గౌసొద్దీన్, లక్ష్మయ్య, సుదర్శన్, నవీన్, సత్యనారాయణ, దేవిరెడ్డి, నర్సింలు, అరవింద్, లాలయ్య ఉన్నారు.

మోదీని గద్దె దించాలి

దోమ: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలను ఓడించి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.వెంకటయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో బీజేపీ పూర్తిగా విఫలమయిందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని గద్దె దించి, దేశాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. సీపీఎం నాయకులు సత్తయ్య, రఘురాం, శేఖర్, ప్రశాంత్, ప్రభు, రాంచంద్రయ్య, కృష్ణ, శ్రీను ఉన్నారు.

గుండ్లకుంటలో..

కొడంగల్: కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి కోరారు. మున్సిపల్ పరిధి గుండ్లకుంటలో చైర్మన్.. ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, కేంద్రంలోనూ ఉంటే రాష్ట్రం, దేశం మరింత అభివృద్ధి చెందుతుందని, చేతి గుర్తుకు ఓటువేసి, వంశీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఇందులో కో ఆప్షన్ సభ్యుడు మునీర్, కౌన్సిలర్ రమేష్ ఉన్నారు.

దోపిడీ చేసిన బీజేపీ, బీఆర్ఎస్

పరిగి: 'బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు. నిలువునా దోపిడీ చేసిన రెండు పార్టీలను లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలే బొంద పెడతారు. కాంగ్రెస్ పాలనలోనే అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయి' అని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు.


మండల పరిధి తిమ్మారెడ్డిపల్లిలో కొనసాగుతున్న నంబి గురుస్వామి ఉత్సవాల్లో శనివారం రాత్రి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్పీకర్‌తో పాటు వైస్ ఎంపీపీ బందయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.
– నవాబుపేట

బ్యూటీ పార్లర్ కోర్సులో ఉచిత శిక్షణ

అనంతగిరి: బ్యూటీ పార్లర్ కోర్సులో మహిళలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, చిలుకూరుతో శిక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మే 8వ తేదీ నుంచి శిక్షణ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. ఆసక్తి గలవారు నేటి నుంచి 8వ తేదీ వరకు సంస్థ కార్యాలయం, సంస్థ సంచాలకులు రమేశ్ 8500165190, 7981951167 ఫోన్ నంబర్లలో ఉదయం 10 గంటల నుంచి, సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించగలరని సూచించారు. అభ్యర్థులు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. వయస్సు 19 సంవత్సరాల నుంచి 45 లోపు ఉండాలని, 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని వెల్లడించారు. పదో తరగతి మెమో, రేషన్ కార్డ్, ఆధార్‌తో పాటు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ కాపి సమర్పించాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత హాస్టల్ వసతి, భోజన సౌకర్యం, యూనిఫాం, టూల్ కిట్స్ ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు.

ఎన్నికల తరువాత బీఆర్ఎస్ ఖాళీ

పెద్దేముల్: పార్లమెంట్ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ రూపు రేఖలు లేకుండా పోతుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి జోష్యం చెప్పారు. మండల కేంద్రంలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పదేళ్ల కాలంలో కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని ఆరోపించారు. దేవుడి పేరుతో మోసం చేసే పార్టీలకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఇందులో జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్, పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, మైనార్టీ సెల్ కన్వీనర్ రియాజ్, ప్రవీణ్‌కుమార్, పెంటప్ప, నర్సింలు ఉన్నారు.

హస్తంతోనే ప్రజాపాలన సాధ్యం

మోమిన్‌పేట: ప్రజా పాలన కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మోమిన్‌పేట మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో, స్పీకర్ సమక్షంలో క్యాంపు కార్యాలయంలో హస్తం కండువాలు కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారిలో.. మాజీ ఎంపీపీ శివకుమార్ స్వామి, ఎం.విఠల్, బక్కారెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, ఖదీర్ ఉన్నారు. అనంతరం స్పీకర్ మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా ప్రభుత్వం అమలు చేస్తుందని వెల్లడించారు.

వారి ప్రోత్సాహం అభినందనీయం

- ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్


మహేశ్‌చారికి తబలను బహూకరిస్తున్న హరిప్రసాద్ వాసిష్ట

కొడంగల్ రూరల్: కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక ఫంక్షన్‌హాలులో పట్టణానికి చెందిన నరహరి వాసిష్ట మూడో వర్ధంతిని పురస్కరించుకుని భక్తి గీతాలు, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో వివిధ ఆలయాల భజన మండలి సభ్యులు, ఆధ్యాత్మిక ధార్మిక సేవా సమితి సభ్యులు, తాండూరు పోట్లీ మహరాజ్ సంస్థాన్ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు. అనంతరం నరహరి జ్ఞాపకార్థం వారి కుమారులు కళాకారులను ఘనంగా సన్మానించారు. ప్రముఖ కళాకారుడు మహేశ్‌చారికి రూ.25 వేల విలువైన తబలను వారు బహూకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. వృత్తి రీత్యా ఉపాధ్యాయులైన నరహరి.. కళాభిమాని కావడం, శారదా లలిత కళా నికేతన్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ ఎందరో కళాకారుల అభినందనలు పొందారని కొనియాడారు. ఆయన జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు.. అంతరించిపోతున్న కళలకు జీవం పోస్తూ, ప్రోత్సహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నందారం శ్రీనివాస్, పాతకోట్ల గోపాల్, అక్కి శ్రీనివాసమూర్తి, మాస్టర్ రఘు, డీడీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థా చారి, ఆధ్యాత్మిక ధార్మిక సేవా సమితి సభ్యుడు డాక్టర్ హీరాలాల్, కొత్తూరు పాండురంగయ్య, తుకారాం, మొగులయ్య, సాయిలు, పోట్లీ మహరాజ్ సంస్థాన్ సభ్యులు భజన మండలి మాస్టర్లు హిందూర్ రాములు, శేఖర్, మనోజ్, సాయన్న, నిహాల్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ అంటేనే కరువు

- అధికారంలోకి రావడంతోనే ప్రజలకు కష్టాలు
- బీఆర్ఎస్ హయాంలోనే సంక్షేమం
- మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


పరిగి: రంగంపల్లిలో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

పరిగి: 'కాంగ్రెస్ అంటేనే కరువు. తొమ్మిది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజా సంక్షేమం కోసం కృషి చేసింది. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తరువాత రాష్ట్ర ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. పార్లమెంట్‌లో తెలంగాణ సమస్యలపై గళం విప్పాలన్నా, అభివృద్ధి చెందాలన్న అది బీఆర్ఎస్‌తోనే సాధ్యం' అని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం మండల పరిధి రంగంపల్లి, మిట్టకోడూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఉపాధి పనుల ప్రదేశానికి వెళ్లి, పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కూలీలను అభ్యర్థించారు. అనంతరం కొప్పుల మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు మాయమాటలు చెప్పి, ఓట్లు దండుకున్న కాంగ్రెస్.. ఈ ఎన్నికల్లో ఏం చెప్పినా వారు వినే పరిస్థితిలో లేరని చెప్పారు. హామీలను నెరవేర్చడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదని, గతంలో బీఆర్ఎస్ ఎంపీలే పార్లమెంట్‌లో కొట్లాడి, అభివృద్ధి పనులకు నిధులు తెచ్చారని గుర్తు చేశారు. మళ్లీ రాష్ట్రం నుంచి పార్లమెంట్‌లో కొట్లాడే వ్యక్తి కావాలంటే కాసానికి ఓటు వేసి, గెలిపించాలని కోరారు. ఇందులో పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, నీరటి నరహరి ఉన్నారు.

ఉన్నంత కాలం అండగా ఉంటా..

పెద్దేముల్: 'నేను ఓడి పోయినా.. బతికున్నంత కాలం తాండూరు ప్రాంత ప్రజలకు అండగా ఉంటా. ఆగస్టు 15వ తేదీలోపు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయకపోతే.. బుయ్యని మనోహర్‌రెడ్డి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా?' అని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రశ్నించారు. మండల పరిధి ఇందూరు, జైరాంతండాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో రోహిత్ మాట్లాడారు. పదేళ్ల కాలంలో బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీల అమలులో విఫలమయిందని ఆరోపించారు. తెలంగాణ సమస్యలు పార్లమెంటులో వినిపించాలంటే కారు గుర్తుకు ఓటువేసి, బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలిపించాలని కోరారు. ఇందులో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ప్రవీణ్‌పటేల్, ధన్‌సింగ్, మాజీ సర్పంచ్‌లు మెగులప్ప, రుక్మాపూర్ రమేష్, జై రాం నాయక్, అంజప్ప ఉన్నారు.

ట్యాంకర్లతో తాగు నీటి సరఫరా


నీటిని పట్టుకుంటున్న ఇందూరు గ్రామస్తులు

పెద్దేముల్: మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ లీకేజీతో పలు గ్రామాలకు తాగునీటి సమస్య ఏర్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి మారేపల్లిలో భగీరథ బీపీటీ వద్ద పైప్‌లైన్ లీకు అవడంతో సంబంధిత అధికారులు తాత్కాలికంగా నీటి సరఫరాను నిలిపి వేశారు. ఆయా గ్రామాలకు బోరు బావుల ద్వారా నీటిని సరఫరా చేయగా.. ఇందూరు గ్రామంలోని కొన్ని వార్డులకు బోరు-బావులు డ్రై కావడంతో శనివారం ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేశారు. ఇందూరుతో పాటు ఆత్కూర్, జైరాంతండా, ఓంటి మామిడితండా, గిర్మాపూర్, హన్మాపూర్, గొట్లపల్లితో పాటు సుమారు 14 గ్రామాలకు నీటిని సరఫరా చేసినట్లు ఏఈఈ అకిల్ తెలిపారు. త్వరలో పైపులైన్‌కు మరమ్మతు చేసి, నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని వెల్లడించారు.

నేడు ఎమ్మెల్యే రాజాసింగ్ రాక

తాండూరు టౌన్: పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆదివారం తాండూరు పట్టణానికి రానున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు బైకు ర్యాలీ, అనంతరం ఇందిరాచౌక్‌లో నిర్వహించే స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే పాల్గొననున్నట్లు వెల్లడించారు. సమావేశానికి పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డితో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు రానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యకు మించిన ఆస్తిలేదు


విజేతలకు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎమ్మార్

- ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగండి
- ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు టౌన్: విద్యకు మించిన ఆస్తిలేదని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సింధు డిగ్రీ కళాశాల వార్షికోత్సవంలో బీఎమ్మార్ మాట్లాడారు. చదువు.. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని, దానిని నిర్లక్ష్యం చేయకుండా.. నిరంతరం శ్రమించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక, సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. విజేతలకు ఎమ్మెల్యే బహుమతులను అందజేశారు. కళాశాల చైర్మన్ రంగారావు, డైరెక్టర్ విజయాదేవి, కౌన్సిలర్లు నీరజ, రత్నమాల, నాయకులు మురళీకృష్ణ గౌడ్, వడ్డే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే సుభిక్ష పాలన

- సంక్షేమ పథకాల్లో నగం వాటా కేంద్రానిదే
- దేశ సంరక్షణకు ఓటు వేద్దాం.. బీజేపీని గెలిపిద్దాం
- ఇంటింటి ప్రచారంలో కమలనాథులు


తాండూరు టౌన్: సాయిపూర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న కమలనాథులు

కుల్కచర్ల: దేశం కోసం.. ధర్మం కోసం లోకసభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేద్దామని ఆ పార్టీ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు బంధయ్య ఆధ్వర్యంలో లింగంపల్లిలో ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉండటంతోనే.. నిరీక్షణలో ఉన్న రామమందిరాన్ని నిర్మించుకోగలిగామని, కశ్మీర్ సమస్యను పరిష్కరించుకున్నామని వెల్లడించారు. ఎంపీ అభ్యర్థి కొండాను ఆశీర్వదించి, చేవెళ్లను మోదీకి కానుకగా ఇద్దామని ఓటర్లను కోరారు. ఇందులో గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాయక్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శరత్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మైపాల్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీను, శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శి హన్మంతు, రఘు, చెన్నయ్య, వెంకటేశ్ ఉన్నారు.

మా నాన్నను గెలిపించండి..

ధారూరు: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి, మా నాన్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే, ప్రజా సమస్యల సాధనకై పనిచేస్తానని కొండా తనయుడు విశ్వజిత్‌రెడ్డి అన్నారు. మండల పరిధి రుద్రారం, గట్టెపల్లి, హరిదాస్‌పల్లి, చింతకుంట, కుక్కింద, అల్లిపూర్‌లో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ప్రధాని మోదీతోనే దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందని, ఆయనకు మరోసారి అవకాశం ఇవ్వాలంటే.. కొండాను గెలిపించి, చేవెళ్లను కానుకగా ఇవ్వాలని కోరారు. అందుకు కమలం గుర్తుకు ఓటువేసి బీజేపీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఇందులో పార్టీ వికారాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్లనందు, ఎస్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజునాయక్, పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి, నాయకులు పాండుడౌడ్, అధికార ప్రతినిధి రాజేందర్‌గౌడ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు యాస్కి శిరీష, రాఘవేందర్‌గౌడ్, విజయలక్ష్మి, అనిల్‌గౌడ్, రామకృష్ణారెడ్డి ఉన్నారు.

సంక్షేమం మరచిన బీఆర్ఎస్

పూడూరు: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశ్ పటేల్ అన్నారు. మండల పరిధి రేగడిమామిడిపల్లి, బాకాపూర్, చన్గోముల్, కంకల్ గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా పటేల్ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాల్లో 50 శాతం వాటా కేంద్రానిదే ఉంటుందని తెలిపారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను విస్మరించిందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందాయని వెల్లడించారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు అనీల్, సుభాన్, శ్రీశైలం ఉన్నారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్ ఆశాభావం వ్యక్తంచేశారు. మండల పరిధి మన్‌సాన్‌పల్లి, జనగాం, మంబాపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీలో చేరారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు హరీశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు యాదయ్య గౌడ్, రాంచందర్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ రమేష్ సాగర్, మండల మాజీ అధ్యక్షుడు సందీప్ కుమార్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కృష్ణ ఉన్నారు.

సాసర్.. కాసారం!


భానుడి భగభగలతో చెరువులు, కుంటలు అడుగంటి పోయాయి. నీటితో కళకళలాడాల్సిన జలాశయాలు సైతం.. వట్టిపోయి ఎడారిని తలపిస్తున్నాయి. మండల పరిధి తుంకిమెట్ల చెరువులో నీరంతా ఇంకిపోయి.. ఇలా మధ్యలో ఉన్న కాస్త జలాలతో.. సుదర్శన చక్రం, సాసర్‌లా కనిపిస్తున్న ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.
– బొంరాస్‌పేట